www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్రవారం 08 జూలై 2022 | ఎడిటర్: గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-98 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## కెసిఆర్ పట్టుదలతోనే కాకతీయ చరిత్రకు వెలుగు



ఘనంగా కాకతీయ ఉత్సవాలు ప్రారంభం

కాకతీయుల వారసుడు మహారాజా కమల్ చంద్ర భంజ్ దేవ్ రాక

ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్న భంజ్‌దేవ్

**వరంగల్, జూలై 7 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ పట్టుదలతో కాకతీయుల చరిత్ర ప్రపంచానికి తెలిసిందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు వరంగల్‌లో కాకతీయ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాకతీయుల వారసుడు మహారాజా కమల్ చంద్ర భంజ్ దేవ్ ఈ ఉత్సవాలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్,వినయ్ భాస్కర్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్.. వరంగల్ అంటే కేసీఆర్‌కు ప్రేమ ఎక్కువన్నారు. కాకతీయుల వారసుడిని పిలిచి ఉత్సవాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చరిత్రను కాపాడే ప్రయత్నం చేస్తుందన్నారు. కాకతీయ గడ్డపై పుట్టినందుకు సంతోషంగా ఉందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. కాకతీయుల పాలన ప్రభుత్వాలకు స్ఫూర్తి అని అన్నారు. కాకతీయుల ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందని..గొలుసుకట్టు చెరువులను ఆదర్శంగా మిషన్ కాకతీయ 2



# కనుమరుగైన ఎమ్మెల్యే విజన్




DAY 1

### మునుగోడు నియోజకవర్గ ప్రజలకు మాయ మాటలు... నీలి ముటలుగా...

### ఎన్నికలలో హామీలు ఇచ్చి చేతులెత్తేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

> సెంటిమెంట్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఎన్నికల హామీలలో భాగంగా మునుగోడు నియోజకవర్గం మొత్తం ప్రతి మండలానికి ఒక విజన్ డాక్యుమెంట్‌ను ప్రచురణ చేసి ప్రజలకు హామీల రూపంలో మభ్యపెట్టి ఓట్లు దండుకున్న ఘనత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సొంతం. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయిన ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న పత్రిక "సమ సమాజం తెలుగు దిన పత్రిక" ప్రత్యేక కథనాలు మునుగోడు నియోజకవర్గ ప్రజల కోసం.

**నల్లగొండ, జూలై 7 (సమ సమాజం):** 2018 అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే సమయంలో మునుగోడు నియోజకవర్గం "విజన్ డాక్యుమెంట్" సాగు నీరు, త్రాగునీరు, మంచి రోడ్లు పేరుతో మ్యానిపెస్టోలను రూపొందించి ప్రజల ముందు పెట్టిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని నమ్మి ఓట్లు వేసిన మునుగోడు నియోజక వర్గ ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. అత్యంత సంపన్నుడు తన సొంత నిధులతో మంచి చేస్తాడని భ్రమపడ్డ ప్రజలకు అశలు అడిఆశలైపోయాయి. 2018 ఎన్నికల ప్రచారంలో తమ సొంత నిధులతో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని చెప్పిన మాటలు వాస్తవం. కాని ఆచరణలో అట్టి హామీలను అమలు చేయలేకపోయాడు.

● **2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నారాయణపురం మండల ప్రధాన హామీలు:**

రాచకొండ భూసమస్య పరిష్కారం చేసి బాధిత రైతులకు న్యాయం చేస్తాను, రాచకొండ పర్యాటక ప్రాంత అభివృద్ధి మరియు స్వయంభులింగేశ్వర ఆలయా నిర్మాణం చేపడుతాం అని ఎన్నో హామీలు నారాయణపురం మండల ప్రజలకు చెప్పిన ప్రధాన హామీలలో ఏ ఒక్క హామీని నెరవేర్చారా? ఇలాంటి హామీలు నియోజకవర్గం వ్యాప్తంగా హామీలు ఇచ్చి.. పనులు చేయకుండా గెలిచిందే తరువాయి నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడకుండా నాలుగు సంవత్సరాలు కాలయాపణ చేసి ఇప్పుడు ప్రభుత్వం పై నిందలు వేయటం సవబేనా ఎమ్మెల్యే సాబ్?.... (కథనం కొనసాగింపు.. రేపటి సంచికలో)

www.samasamajam.in

## విద్యుత్ సంస్కరణలపై వెనకడుగు

కేంద్ర అమోహాల్లో ఇదొకటి అన్న మంత్రి



**సూర్యాపేట, జూలై 7 (సమ సమాజం):** విద్యుత్ సంస్కరణలపై కేంద్రం వెనకడుగు అంటూ వస్తున్న కథనాలు ముమ్మాటికి మోసపురితమైనవని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించిన మీదటనే కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఇలాంటి లీకేజీలు ఇస్తుందంటూ ఆయన మండిపడ్డారు. విద్యుత్, వ్యవసాయ చట్టాలు దేశ ప్రజలకు గొడ్డలి పెట్టు లాంటివని ఆయన చెప్పారు.తెలంగాణలో అమలు చేస్తున్న విద్యుత్ విధానం 2

## బ్రిటన్ ప్రధాని పదవికి బోరిస్ రాజీనామా

ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగింపు

నూతన మంత్రివర్గం ఏర్పాటు

అక్టోబర్‌లో కొత్త ప్రధానికి అవకాశం



**లండన్, జూలై 7 (సమ సమాజం):** బ్రిటిష్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. తదుపరి ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ప్రధానిగా ఆయన కొనసాగుతారు. దీని కోసం ఆయన నూతన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. అక్టోబరునాటికి నూతన ప్రధాన మంత్రి ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు ఆ దేశ మీడియా చెప్తోంది. బోరిస్ జాన్సన్ దాదాపు మూడేళ్ళపాటు ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తాను ప్రపంచంలో అత్యుత్తమ పదవిని వదులుకుంటున్నట్లు బోరిస్ చెప్పారు. ప్రధాన మంత్రిగా తన వైఫల్యాల పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కన్జర్వేటివ్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం తీవ్ర రాజకీయ సంక్షోభంలో చిక్కుకోవడంతో ఆయన తన పదవికి రాజీనామా సమర్పించారు. అనంతరం ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. నూతన ప్రధాని నియమితుడయ్యే వరకు తాను పదవిలో కొనసాగుతానని చెప్పారు. తన వైఫల్యాలకు విచారం వ్యక్తం చేస్తూ, తన విజయాల పట్ల తాను గర్వపడుతున్నానని తెలిపారు. ఆయనకు అత్యంత సన్నిహితుడైన ట్రెజరీ చీఫ్ నధిమ్ జహవి సలహా మేరకు ఆయన రాజీనామా చేసినట్లు బ్రిటిష్ మీడియా వెల్లడించింది. జాతిని ఉద్దేశించి బోరిస్ మాట్లాడుతూ, కన్జర్వేటివ్ పార్టీ ఎంపీలు, మంత్రివర్గ సహచరుల పిలుపును శిరసావహిస్తూ నేను ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నాను అని చెప్పారు. బోరిస్ తర్వాత భారత సంతతికి చెందిన రుషి సునక్ ప్రధాన మంత్రి పదవిని చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బోరిస్ రాజీనామాపై భారత ప్రభుత్వం స్పందిస్తూ, ఇది ఆ దేశ అంతర్గత వ్యవహారమని పేర్కొంది.

# గ్యాస్ ధరలతో ప్రజలకు గుండె దడ




దేశ ప్రజలపై దొంగ దాడి చేస్తోన్నకేంద్రం

ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయలేని దౌర్భాగ్య పాలన

మోదీ ఆర్థిక విధానాలతో వంట గదుల్లో మంట

గ్యాస్ ధరల పెరుగుదలపై మండిపడ్డ మంత్రి కెటిఆర్

ధరలకు వ్యతిరేకంగా నిరంతరంగా పోరాడుతామని ప్రకటన

**హైదరాబాద్, జూలై 7 (సమ సమాజం):** గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ మోయలేని భారంగా మార్చారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. గడియకోసారి పెరుగుతున్న గ్యాస్ ధరలతో ప్రజలకు గుండెదడ వస్తోందన్నారు. మోదీ పాలనలో వంట గదుల్లో మంటలు పుడుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచి దేశ ప్రజలపై దొంగ దాడి చేస్తోందని ధ్వజమెత్తారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయలేని దౌర్భాగ్య పాలనలో దేశం ఉందన్నారు. గ్యాస్ ధర పెంపుపై నిరసన చేపట్టిన టీఆర్ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయలేని దౌర్భగ్య పాలనకు నాయకత్వం వహిస్తున్న మోదీ, ధరలతో దేశ ప్రజలపై దండయాత్ర చేయడం, పన్నులు పెంచి ప్రజల నడ్డి విరచడాన్నే సుపరిపాలనగా భావిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. 2

## ఉద్దవ్ థాక్రేకు మరో ఎదురుదెబ్బ


షిండే గూటికిచేరిన థానేలో 66 మంది కార్పోరేటర్లు




**ముంబై, జూలై 7 (సమ సమాజం):** ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటుతో మహారాష్ట్ర సీఎం పదవి నుంచి వైదొలగిన శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు మరో ఎదురుదెబ్బ తగిలింది. థానే మున్సిపల్ కార్పొరేషన్ లో 66 మంది పార్టీ కార్పొరేటర్లు షిండే క్యాంప్‌లో చేరారు. 66 మంది రెబెల్ కార్పొరేటర్లు బుధవారం రాత్రి సీఎం ఏక్‌నాథ్ షిండేను ఆయన నివాసంలో కలిశారు. సేన కార్పొరేటర్ల తిరుగుబాటుతో ఉద్ధవ్ ఠాక్రే టీఎంసీపై 2

## భారత్‌లో కరోనా కొత్త వేరియంట్

సబ్ వేరియంట్ బిఎ.2.75గా గుర్తించిన డబ్ల్యూహెచ్‌వో




**న్యూఢిల్లీ, జూలై 7 (సమ సమాజం):** భారత్‌లో కరోనా కొత్త వేరియంట్ బయటపడింది. ఒమిక్రాన్ వేరియంట్ కొత్త సబ్ వేరియంట్ బిఎ. 2.75 ఇండియాలో కనుగొన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే ఈ వైరస్ లక్షణాలను పరిశీలిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు. యూరప్, అమెరికాలో, బిఎ4, బిఎ.5 వేరియంట్ల వల్ల రోజురోజుకు కేసులు పెరుగుతున్నాయని జనరల్ టెడ్రోస్ ప్రకటించారు. గత రెండు వారాలుగా ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ కేసులు 30 శాతం మేర పెరిగాయని టెడ్రోస్ తెలిపారు. డబ్ల్యూహెచ్‌వోకు చెందిన ఆరు సబ్ రీజియన్లలో నాలుగు చోట్ల కేసులు పెరుగుతున్నాయని 2

## విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఏటేటా సమస్యలు పెరగడమే తప్ప తగ్గడం లేదు

కార్పోరేట్ స్కూళ్లకు మేలుచేసేలా ప్రభుత్వం తీరు

నెలకావస్తున్నా పాఠ్యపుస్తకాలు అందడం లేదు




**హైదరాబాద్,జూలై7(సమ సమాజం):** పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఏటేటా బందులు, ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని, ఎంఈవో పోస్టులను భర్తీ చేయడం విస్మరించిందంటున్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయాలని, మన ఊరు, మన బడిలో అన్ని పాఠశాలలను చేర్చి అభి వృద్ధికి పాటుపడాలన్నారు. జీవో నం. 42ను అమలు చేస్తూ పాఠశాలల అధిక ఫీజుల దోపిడి అరికట్టాల న్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాల నిర్వాహణ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం కార్పోరేట్, ప్రైవేటు 2

## అగ్గిమీద గుగ్గిలం అవుతున్న ఫారెస్ట్ అధికారులు

పంచాయితీ అధికారుల తీరుపై మండిపాటు

మంత్రి ఇంద్రకరణ్‌కు విషయం చేరవేత

పన్ను బకాయి పేరుతో తాళంతో బారున పడ్డ పరువు

**నిర్మల్, జూలై 7 (సమ సమాజం):** జిల్లాలో అటవీ, పంచాయతీశాఖల మధ్య వివాదం కాస్తా ఇప్పుడు రాజకీయ రంగు పులముకునేలా కనిపిస్తోంది. కడెం మండలంలోని ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసు వారు పన్ను బకాయిలు చెల్లించడం లేదన్న ఆరోపణలపై పంచాయతీశాఖ వారి కార్యాలయాన్ని సీజ్ చేయడం దుమారం రేపుతోంది. దీనిపై జిల్లాకు చెందిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దృష్టిక కొందరు తీసుకుని వెళ్లారు. అధికారుల తీరుపైనా ఆయనకూడా మండిపడ్డట్లు సమాచారం. ఇలా రోడ్డుకెక్కి పరువు తీసుకోవడం ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అంటున్నారు. ఇదిలా ఉండగా పంచాయతీ, అటవీశాఖల మధ్య నెలకొన్న తాజా వివాదంతో జిల్లా యంత్రాంగం ఇప్పటి వరకు స్పందించకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. జిల్లా యంత్రాంగం తీరుపై కూడా అటవీశాఖ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే పన్ను బకాయి చెల్లింపు కోసమే అటవీశాఖ కార్యాలయానికి తాళం వేశామే తప్పా మరో దురుద్దేశం లేదని, నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు 2

## నేటినుంచి సింగరేణిలో దశలవారి ఆందోళన

గుర్తింపు ఎన్నికల కోసం ముందస్తు ప్రణాళిక

**భద్రాద్రికొత్తగూడెం, జూలై 7 (సమ సమాజం):** సింగరేణి కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా కార్మికసంఘాలు ఉద్యమాలకు సిద్ధమవుతున్నాయి.. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గుర్తింపు కార్మికసంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఈనెల8 నుంచి 18వరకు దశల వారీ పోరాటాలకు ప్రణాళిక రూపొందించింది. గుర్తింపు సంఘం ఎన్నికలు త్వరలో జరుగుతాయని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ప్రధాన కార్మికసంఘాలన్నీ ఉద్యమాలకు ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. ఈనెల 11న నిరవధిక నిరాహారదీక్ష చేయడానికి నిర్ణయించారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఈనెల 8న సింగరేణి వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి 12న సింగరేణిలోని 11 ఏరియాల్లో జనరల్ మేనేజరు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాలను జీఎంలకు అందజేయనున్నారు. 18న సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. సీఐటీయూ నిరాహారదీక్షలో, గుర్తింపు కార్మికసంఘం ఆందోళనలతో సింగరేణిలో రాజకీయ వాతావరణం వేడెక్కనుంది.

## పెట్టుబడిదారులే మా బ్రాండ్ అంబాసిడర్లు




● తెలంగాణలో పరిశ్రమల కోసం అనువైన పాలసీ

● సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంబించిన కేటీఆర్

**హైదరాబాద్, జూలై 7 (సమ సమాజం):** పెట్టుబడిదారులే రాష్ట్రానికి అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్లని సీఎం కేసీఆర్ అంటుంటారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో పరిశ్రమల కోసం అనువైన పాలసీ అమల్లో ఉందని స్పష్టం చేశారు. వస్తున్న వారితో ఇతరులకు స్ఫూర్తి కలుగు తోందన్నారు. అందుకే తెలంగాణలో పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందన్నారు. శంషాబాద్‌లో సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ ఎంఆర్ఐ ఫెసిలిటీని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మెగా ఏరో ఇంజిన్ ఎంఆర్‌ఓ ఏర్పాటుకు శాఫ్రాన్ నిర్ణయించిందని తెలిపారు. హైదరాబాద్‌లో శాఫ్రాన్ 2

## సంపాదకీయం

# అక్షర జ్యోతి వెలుగులు విరజిమ్మాలి !

విద్యారంగంలో తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్న ఆలోచన లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇంగ్లీష్ మీడియం ఆశ చూపి స్కూళ్ల విలీనంతో చిన్నపిల్లలు తమ సమీప స్కూళ్లకు వెళ్లే అవకాశం కోల్పోతున్నారు. ఒకప్పుడు విద్యను గ్రామస్థాయికి తీసుకుని వెళ్లాలన్న సంకల్పంతో ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రారంభించారు. చిన్న గ్రామానికి కూడా స్కూలు ఉండాలన్న సంకల్పం వచ్చింది. అక్కడ ఒక్క టీచర్‌ను అయినా నియమించి నడిపించారు. దీంతో అనేక గ్రామాల్లో ఏకోపాధ్యాయ స్కూళ్లు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్న ఊర్లోని స్కూలుకు పంపడం వల్ల అక్షరజ్ఞానం వచ్చింది. ఇది అక్షరాసత్యకు తోడ్పడింది. అక్షరాస్యతను పెంచే క్రమంలో ఇదో విప్లవాత్మక చర్యగా చూడాలి. ఈ లక్ష్యం దెబ్బతినకుండా ఇప్పుడు ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా విద్యావ్యవస్థను అమలు చేయాలి. అంతా తప్ప లక్ష్యం దెబ్బతినే చర్యలకు పూనుకోరాదు. అయితే ఇప్పుడు ప్రభుత్వాలు జీతాల భారం తగ్గించుకునే క్రమంలో స్కూళ్ల విలీనం చర్యలకు పూనుకుంటున్నాయి. దీనివల్ల సామాన్యులకు ప్రభుత్వ విద్య దూరం అవుతోంది. ఈ సమస్యను అర్థం చేసుకున్నట్లుగా లేదు. ప్రాథమిక పాఠశాలలను.. ప్రాథమి కోన్నత, ఉన్నత విద్యాపాఠశాలల్లో విలీనం చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభించిన తొలి రోజునుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన.. కొనసాగింది. మా పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. నిజానికి ప్రతి గ్రామానికి పాఠశాల ఉండాలన్న సంకల్పం దెబ్బతనికుండా చూడాల్సిన ప్రభుత్వం విలీనం పేరుతో ఇలా చేయడం తగదు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే తంతు కొనసాగుతోంది. దీంతో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ విస్తరణకు అవకాశంగా తీసుకుంటున్నాయి. గ్రామాలకు బస్సులను నడుపుతూ,మండల కేంద్రాల్లో స్కూళ్లను పెడుతున్నారు. దీంతో విధిలేక తల్లిదండ్రులు ఇంటిముందుకు వచ్చే బస్సులో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టాలన్న సంకల్పం మంచిదే అయినా గ్రామాలకు పాఠశాలలను దూరం చేయడం మాత్రం సరికాదు. అందుకే పాత పాఠశాలల ను కొనసాగించాలని ఎపిలో పలుప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనబాట పట్టారు. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా తమ పిల్లలు బడులకు దూరమవుతారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నతీరు ప్రభుత్వం వెంటనే గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయ సంఘాలు సైతం విలీనాన్ని నిరసిస్తూ ధర్నాలకు పిలుపు నిచ్చాయి. విలీనం చేయవద్దని కోరుతూ ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు వినతిపత్రాలు అందజేశారు. ఇక్కడ మరో విషయం గమనించాలి. దీనిపై హైకోర్టు కూడా తీవ్రంగానే స్పందించింది. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తామంటే ఎలాగని హైకోర్టు నిలదీసింది. జాతీయ విద్యావిధానమంటూ విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఎలా చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. జీవో 117 విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా ఉందని పేర్కొంది. పాఠశాలల విలీనం కారణంగా చిన్నారులు 1 నుంచి 3 కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోవలసి వస్తుందని పేర్కొంది. చిన్నారులను దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోమనడం సరికాదని వ్యాఖ్యానించింది. విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తున్నట్లు కనిపించడం లేదని కూడా హైకోర్టు అభిప్రాయపడింది. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం మంచిదే అయినప్పటికీ తెలుగు మాధ్యమాన్ని తొలగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోందని గుర్తుచేసింది. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే తెలుగు మాధ్యమంలో బోధనే లేకుండా చేసేటట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. సర్కారు చర్యలు విద్యా వ్యవస్థను బలపరిచేలా ఉండాలని.. నిర్వీర్యం చేసేలా ఉండకూడదని వ్యాఖ్యానించింది. ప్రస్తుత విధానం కొనసాగిస్తూనే సంస్కరణలు ప్రవేశపెట్టవచ్చని సలహా ఇచ్చింది. ఒక దశలో జీవో అమలుపై స్టే విధించేం దుకు సిద్ధపడింది. ప్రస్తుతం ఉన్న విధానానే కొనసాగించేలా యథాతథ స్థితి ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది. జాతీయ విద్యావిధానం అమలు పేరుతో పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ,మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సూచనల మేరకు ఇంగ్లీష్ మీడియంను క్షేత్రస్థాయిలోకి తీసుకని వెళితే అభ్యంతరం ఉండదు. నూతన విద్యా విధానం అమలు పేరుతో పాఠశాల విద్య దెబ్బతినకుండా, పిల్లలకు పాఠశాలలు దూరం కాకుండా చూసుకోవాలి. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ద్వారా స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయరాదు. స్కూళ్లను పెంచి, సౌకర్యాలు కల్పించి, టీచర్లను పెంచడం ద్వారా మరింత పటిష్టంగా అమలయ్యేలా చూడాలి. ప్రభుత్వ అనాలోచిత చర్య కారణంగా చిన్నారులు, బాలికలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది.ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలోనే ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఈ క్రమంలో ఉత్తమమైన ఉన్నతమైన విధానం అమలు చేయాలి. విద్యారంగం అన్నది ఏ రాష్ట్రానికైనా ప్రాధాన్యరంగం కావాలి. ఇంగ్లీష్ మీడియం అన్నది కేవలం అనువుగా ఉన్నచోటనుంచే మొదలు పెట్టాలి. ఏకోపాధ్యా స్కూళ్లను మరింతగా మెరుగు పరచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. దీంతో నిరుద్యోగ సమస్యాకొంత తీరవచ్చు. ఆర్థికంగా భారమైనా విద్‌ఆయరంగానికి కేటాయింపులు పెంచి అనుత్పాదక రంగాలకు, ఉచితపథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే విద్యారంగం పటిష్టం కావడంతో పాటు..అక్షరాస్యతా ఉద్యమం కూడా ముందు సాగగలదు.

**పృధ్విరాజ్ గోసుకొండ**
**ఎడిటర్**

# తొండి సంజయ్.. గుండు అరవింద్

### ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కొత్త భాష్యం



**హైదరాబాద్, జూలై 7 (సమ సమాజం):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై పీయూసీ చైర్మన్ జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన తొండి సంజయ్ అంటూ మరోమారు విమర్వలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్ తొండి సంజయ్ అని... గుండు అరవింద్ , గుండు అరవింద్ అని వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపినట్లు చెప్పిన దానిపై తాను ఆర్టీఐలో వివరాలు కోరామన్నారు. ప్రధాని విద్యార్హతలపై కూడా వివరాలు అడిగినట్లు చెప్పారు. మోదీ వస్త్రాల ధరలు, వాటిని కుట్టిన దర్జీ జీతం వివరాలు కోరామన్నారు. భాగ్యలక్ష్మి టెంపుల్‌కు ఏమైనా నిధులు ఇచ్చారా అని అడుగుతున్నామని అన్నారు. ప్రధాని విదేశీ పర్యటనల ఖర్చు ఎంత, గత ప్రధానుల విదేశీ పర్యటనల ఖర్చు ఎంత?... ఇలా తమకు అనుమానాలు ఉన్న అనేక అంశాలపై ఆర్టీఐ ద్వారా వివరాలు కోరుతున్నామని తెలిపారు. గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు. పరిస్థితి గ్యాస్ నుంచి కట్టెల పొయ్యికి వచ్చింది జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

## విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

(మొదటి పేజి తరువాయి) విద్యాసంస్థలకు కొమ్ముకాసే రీతిలో వ్యవ హరిస్తున్నదని మండిపడు తున్నాయి. ప్రభుత్వమే విద్యాసంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నదని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. విద్యాసంవత్సరం ప్రారంభమయి నెల రోజులు సమీపిస్తున్నా, నేటికి ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ జరగలేదన్నారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ జరగలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వసతుల లేమి సౌకర్యాల కరువుతో విద్యార్థులు సతమతమవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఉపాధ్యాయుల కొరత నేటికి తీరలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యపు ధోరణి విడనాడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థ మెరుగుదలకు తక్షణమే చర్యలు చేపట్టనున్నారు. లేని పక్షంలో తమ ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. మరోవైపు పాఠశాలలు పునఃప్రారంభమై మూడు వారాలు గడిచినప్పటికీ పాఠ్యపుస్తకాల జాడలేదు. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా సర్కారు బడుల్లో మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఓ వైపు ప్రభుత్వం చెబుతోంది. మరో వైపు సర్కారు బడుల్లో సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు తీసుకోవడం లేదు. పాఠశాలలు తెరిచి మూడు వారాలు దాటినా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందలేదు. దీంతో బోధనకు ఆటంకం కలుగుతోంది. 50 శాతం పుస్తకాలే వచ్చాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పదో తరగతికి సంబంధించి గణితం, హిందీ, తొమ్మిదో తరగతికి సంబంధించి భౌతిక శాస్త్రం పుస్తకాలు ఇంతవరకు రాలేదు. 8వ తరగతికి సంబంధించి ఫిజిక్స్, సోషల్, బయాలజీ, ఏడో తరగతికి సంబంధించి మాథ్స్, సైన్స్, సోషల్, 6వ తరగతికి సంబంధించి ఇంగ్లీష్, సోషల్, సైన్స్, మాథ్స్ సబ్జెక్టులు రాలేదు. అలాగే ఒకటి నుంచి ఐదో తరగతికి సంబంధించిన పుస్తకాలు పూర్తిగా వచ్చాయి. గతంలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్య పుస్త కాలను సమ కూర్చేవారు. పాఠశాలలు ప్రారంభమయ్యాక హెచ్‌ఎంలు వాటిని తీసుకువెళ్లి విద్యా ర్థులకు అందించేవారు. కాగా ప్రస్తుతం పుస్తకాలు సగం వరకే రావడం తో వచ్చిన వాటిని అయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి ఇంగ్లీష్ మీడియం ప్రారం భించాం. దీంతో తెలుగు మీడియం విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను రెండు భాషలలో ముద్రిస్తోంది. అందుకే పుస్తకాల పంపిణీలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నామని అధికారులు అంటున్నారు.

## ముక్కులో దూరిన రొయ్య

### కూలీని కాపాడిన వైద్యులు

**ఏలూరు, జూలై 7 (సమ సమాజం):** చూపుడు వేలంతా కూడా లేని రొయ్య ఓ వ్యక్తికి చుక్కలు చూపించింది. ఊపిరాడనివ్వకుండా ఉక్కిరి బిక్కిరి చేసింది. ఈ ఘటన ఏలూరు జిల్లాలో జరిగింది. గణపవరంలోని ఓ చెరువులో రైతు కూలీ రొయ్యలు పడుతుండగా ఓ రొయ్య ఎగిరిపడి అతని ముక్కులోకి దూరింది. అది ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బందిపడి అల్లాడిపోయాడు. దీంతో అతనిని వెంటనే భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎండోస్కోపీ ద్వారా ముక్కు రంధ్రం నుంచి రొయ్యను బయటకు తీశారు. అప్పటికీ ఆ రొయ్య బతికుండడం విశేషం.

## భారత్‌లో కరోనా కొత్త వేరియంట్

(మొదటి పేజి తరువాయి) వెల్లడించారు. ఒమిక్రాన్ సబ్ వేరియింట్ బిఎం. 2.75 వైరస్ పై చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ ట్విట్టర్‌లో వీడియో పోస్ట్ చేశారు. ఈ ఉప-వేరియంట్ మొదటగా భారత్‌లో గుర్తించామని తెలిపారు. భారత్‌తో పాటు.. మరో 10 దేశాల్లోనూ వైరస్ గుర్తించినట్లు వెల్లడించారు. ఈ సబ్ వేరియంట్ స్పైక్ ప్రోటీన్ రిసెప్టర్ -బైండింగ్ డొమైన్‌పై కొన్ని ఉత్పరివర్తనాలను కలిగి ఉన్నట్లు అనిపిస్తుందని చెప్పారు. అయితే వైరస్ వల్ల రోగనిరోధక శక్తికి ఏ మేరకు ఇబ్బంది కలిగిస్తుంది...మనిషిపై ఏ మేరకు ప్రభావం ఉంటుందో తెలుసుకోవడానికి మరింత సమయం పట్టవచ్చని తెలిపారు. వైరస్‌ను డబ్ల్యూహెచ్‌వో నిత్యం ట్రాక్ చేస్తోందని...సాంకేతిక సలహా బృందం నిరంతరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న డేటాను చూస్తోందన్నారు.

## ఉద్ధవ్ థాక్రేకు మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజి తరువాయి) పట్టు కోల్పోయారు. మహారాష్ట్రలో బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) తర్వాత టీఎంసీ అత్యంత ప్రతిష్టాత్మక నగరపాలక సంస్థ కావడం గమనార్హం. సీనియర్ నేత ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేయడంతో జూన్ 29న మహా వికాస్ అఘాడి ప్రభుత్వం కూలిపోయింది. బీజేపీ మద్దతుతో ఏక్‌నాథ్ షిండే సీఎం పగ్గాలు చేపట్టగా కాషాయ పార్టీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# గ్యాస్ ధరలపై భగ్గుమన్న టీఆర్ఎస్

### ఊరూవాడా ధర్నాలు, రాస్తారోకోలు ● రోడ్లపైనే వంటావార్పులతో నిరసనలు● పొయ్యిలు పెట్టి మోదీకి వ్యతిరేకంగా నినాదాలు




**హైదరాబాద్, జూలై 7 (సమ సమాజం):** పెంచిన గ్యాస్ ధరలపై ప్రజలు భగ్గుమన్నారు. పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాలని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపునకు తెలంగాణ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ధర్నాలకు దిగారు. వంటావార్పులు చేపట్టారు. ఎక్కడిక్కడ రోడ్లపై పొయ్యిలు పెట్టి నిరసనలు తెలిపారు. అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. గ్యాస్ స్టవ్‌లపై కట్టెలు పెట్టి మోదీ ప్రభుత్వం పై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పలు చోట్ల మోదీ దిష్టి బొమ్మలను దహనం చేశారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు రూ. 410గా ఉన్న సిలిండర్ ధర ఈ రోజు సుమారు మూడు రెట్లు పెరిగి రూ. 1100 దాటడం దురదృష్టకరమన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ. 1100పైగా గ్యాస్ రేటు చేరడం బీజేపీ అసమర్థ పరిపాలనకు నిదర్శనమన్నారు. పేదలకు పెను భారంగా మారిన పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ నిరసన కార్యాక్రమాల్లో పాల్గొన్నారు.గ్యాస్ సిలిండర్ ధరల పెంపునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. మహిళలు గ్యాస్ సిలిండర్లతో ప్రదర్శన చేపట్టారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని పదవి నుంచి మోదీ దిగిపోవాలని మహిళలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. స్వల్ప కాలంలోనే రెండుసార్లు రూ. 50 చొప్పున సిలిండర్ ధరను పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్ల క్రితం రూ. 400 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర ఇవాళ రూ. 1105కు చేరిందన్నారు. సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ చొప్పదండిలో టీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఖాళీ సిలిండర్లను రోడ్లపై పెట్టి..కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇటు పెద్దపల్లి జిల్లాలోనూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. పెంచిన సిలిండర్ ధరలను నిరసిస్తూ గోదావరిఖని రాజీవ్ రహదారిపై టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ అనిల్ కుమార్ పాల్గొని.. కేంద్రంపై నిప్పులు చెరిగారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వ్యతిరేకిస్తూ సత్తుపల్లి మండలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో గ్యాస్ సిలిండర్ల తో నిరసన తెలిపారు. రోడ్లపై గ్యాస్ సిలిండర్లను ప్రదర్శిస్తూ వంటా, వార్పు కార్యక్రమం నిర్వహించారు.

## విద్యుత్ సంస్కరణలపై వెనకడుగు

(మొదటి పేజి తరువాయి) ఎప్పటికైనా మేలని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ..బీజేపీ విధానాలపై ÷ర్ అయ్యారు. వ్యవసాయ చట్టాల విషయంలోనూ గతంలో ఇదే జరిగిందని ఆయన ఆరోపించారు. కొత్తగా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నట్లు కేంద్రం ప్రకటించినప్పటికీ..తదనంతర కాలంలో మళ్లీ అవే చట్టాలు తీసుకొస్తామంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలను ఆయన గుర్తు చేశారు. సంస్కరణల మార్పు విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం లేదన్నారు. సంస్కరణలను ప్రతిపాదించిన రోజున కేంద్రం పంపిన దానికి ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి కేసీఆర్ లేఖ ద్వారా స్పష్టంగా తెలియజేశారని మంత్రి గుర్తు చేశారు. తాజాగా వస్తున్న లీకేజీల పై కేంద్రం రాష్ట్రాన్ని సంప్రదించిన పక్షంలో ప్రజల గొంతుకకు అనుగుణంగా సీఎం కేసీఆర్ నిర్ణయం ఉంటుందన్నారు.

## కెసిఆర్ పట్టుదలతోనే కాకతీయ చరిత్రకు వెలుగు



(మొదటి పేజి తరువాయి) చేపట్టామన్నారు. కాకతీయుల ఉత్సవాలు సీఎం ఆదేశాలతో నిర్వహిస్తున్నామన్నారు. తమ వంశస్తుల గడ్డకు రావడం సంతోషంగా ఉందన్నారు కమల్ చంద్ర భంజ్ దేవ్. ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. ఇక్కడి నుంచి వెళ్ళినా బస్తర్ లో మాన్సేవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఓరుగల్లు కోటలో వారం పాటు జరగనున్న కాకతీయ వైభవ సప్తాహ వేడుకలను మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ వేడుకలకు కాకతీయ 22వ తరం వారసులైన కమల్‌చంద్ర భంజ్‌దేవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మొట్టమొదటిసారి ఆలయానికి వచ్చిన కమల్‌చంద్రకు మంత్రులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంతో శతాబ్దాల అనుబంధమున్న కాకతీయుల చరిత్ర, పాలనా వైభవం, కళావిశిష్టతలను భావితరాలకు తెలిపే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నేటి నుంచి 7 రోజుల పాటు వరంగల్, హైదరాబాద్ లలో కాకతీయ వైభవ సప్తాహాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. భద్రకాళి ఆలయ స్వాగత ద్వారం నుంచి ఆలయం వరకు డప్పు, డోలు కళాకారులు, పేరిణి నృత్య కళాకారులు కమల్‌చంద్ర భంజ్‌దేవ్‌కు స్వాగతం పలికారు. అనంతరం వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కాకతీయ వైభవంపై ఏడురోజుల పాటు నాటకాలు, సదస్సులు, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని కమల్‌చంద్ర భంజ్‌దేవ్ పేర్కొన్నారు. ఈ వేడుకలకు తనను ఆహ్వానించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## అగ్గిమీద గుగ్గిలం అవుతున్న ఫారెస్ట్ అధికారులు

(మొదటి పేజి తరువాయి) పరిశీలిస్తారని జిల్లా పంచాయతీ అధికారి అన్నారు. తాము టైగర్‌జోన్ కోర్ ఏరియాలో క్రీడా మైదానాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వకపోవడంతోనే పంచాయతీశాఖ అధికారులు కక్షసాధింపు చర్యకు పాల్పడ్డారంటూ అటవీ అధికారులు బహిరంగంగా పేర్కొంటున్నారు. అటవీశాఖరేంజ్ కార్యాలయానికి పన్ను బకాయిల పేరిట తాళం వేసిన వ్యవహారం వెనక జిల్లా యంత్రాంగం పాత్ర కూడా ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకే అటవీశాఖ కార్యాలయానికి తాళం వేసి ఉండవచ్చన్న అనుమానాలను కూడా సంబంధిత శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. తాము ఆరుబయటనే విధులు నిర్వహిస్తున్నప్పటికి జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోతుండడం పట్ల అటవీశాఖ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం అటవీశాఖ అధికారుల ఆగ్రహానికి కారణమవుతోంది. రేంజ్ ఆఫీసుకు పంచాయతీ అధికారులు తాళం వేయడంతో ఫారెస్టు అధికారులంతా ఆరుబయట టేబుళ్లపై తమ విధులను నిర్వహిస్తున్నారు. అటవీశాఖ భూముల్లో డంపింగ్ యార్డులు, స్మశానవాటికలు, ప్రకృతివనాలు, క్రీడామైదానాలు లాంటివి ఏర్పాటు చేస్తున్న కారణంగానే ఈ రెండుశాఖల మధ్యదూరం పెరిగిందని అంటున్నారు. టైగర్‌జోన్ కోర్ ఏరియాలో నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవ్వడంతో అటవీశాఖ ఆ నిర్మాణాలను సీరియస్‌గా అడ్డుకుంది. ముఖ్యంగా కడెం మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో గల టైగర్ రిజర్వ్‌కోర్ ఏరియాలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అధికారులు ప్రతిపాదించారు. అయితే అటవీ నిబంధనల ప్రకారం టైగర్ రిజర్వ్‌కోర్ ఏరియాలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, అలాగే ఎలాంటి అభివృద్ధి పనులు కూడా చేయవద్దంటూ నిబంధనలున్నాయి. అయితే ఈ నిబంధనలను పట్టించుకోకుండా పంచాయతీశాఖ క్రీడామైదానం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. అటవీశాఖ అధికారులు దీనిని సీరియస్‌గా అడ్డుకోవడమే కాకుండా అనుమతి నిరాకరించారు. అప్పటి నుంచి అటవీశాఖపై పంచాయతీశాఖ అధికారులు కక్షగట్టారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీశాఖ రేంజ్ ఆఫీసుకు తాళం వేసిన వ్యవహారాన్ని ఆ శాఖ అధికారులు సీరియస్‌గానే పరిగణిస్తున్నారు. అటవీశాఖ ఉద్యోగుల సంఘం బాధ్యులు మంగళవారం నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. మంత్రి సైతం పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

## పెట్టుబడిదారులే మా బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి పేజి తరువాయి) ఏర్పాటు చేసే ఎంఆర్ఓ ప్రపంచంలోనే పెద్దదని చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థ భారత్‌లో ఏర్పాటు చేసే మొదటి ఇంజిన్ ఎంఆర్ఓ అని పేర్కొన్నారు. ఎంఆర్ఓ, ఇంజిన్ టెస్ట్ సెల్ పెట్టుబడి దాదాపు రూ. 1200 కోట్లు అని తెలిపారు. 800 నుంచి వెయ్యి మంది దాకా ఉపాధి లభిస్తుంద న్నారు. శాఫ్రాన్ నిర్ణయం హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఇతర సంస్థలకు ప్రేరణగా నిలుస్తుంద న్నారు. పెట్టుబడిదారులే రాష్ట్రానికి అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్లని సీఎం కేసీఆర్ అంటుంటారని గుర్తు చేశారు. తెలంగాణలో పరిశ్రమల కోసం అనువైన పాలసీ అమల్లో ఉందన్నారు. విమాన రంగంలో కేంద్రం నుంచి తెలంగాణకు అనేక అవార్డులు వచ్చాయని తెలిపారు. ఆవిష్కరణల కోసం టీ హబ్ వంటి ఎ÷-లాట్‌ఫాంను అందుబాటులోకి తీసుకొచ్చామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పరిశ్రమల కార్యదర్శి జయేశ్ రంజన్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరలతో ప్రజలకు గుండె దడ

(మొదటి పేజి తరువాయి) గ్యాస్ ధరల పెంపుకి అంతర్జాతీయ కారణాలను చూపించి తమ చేతకానితనాన్ని దాచాలనుకుంటున్న మోదీ ప్రభుత్వ కుటిల నీతిని దేశ ప్రజలు గుర్తిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఉజ్వల పథకం పేరుతో తమకు అంటగట్టిన సిలిండర్ లను పెరుగుతున్న గ్యాస్ ధరలతో మహిళలు ఉపయోగించడం లేదన్న కేటీఆర్, మళ్లీ కట్టెల పొయ్యి దిక్కు చూస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ చెప్తున్న జుమ్లాలా మాదిరగానే ఉజ్వల పథకం తయారైందన్నారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే ధరలను నియంత్రించి దొంగ నాటకాలు ఆడే బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా పేద ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించి గ్యాస్ సిలిండర్ ధరని తగ్గించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర అసమర్థ పాలన విధానాలపై నిరంతర పోరు సాగిస్తామని కేటీఆర్ తేల్చిచెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో వంట గదుల్లో మంట పుట్టిందని కేటీఆర్ ఆరోపించారు. 8 సంవత్సరాల అసమర్థ మోదీ పరిపాలనలో సుమారు 170 శాతం పెంపుతో, ఇవాళ ప్రపంచంలోనే అత్యధిక రేటుకు వంట గ్యాస్ అమ్ముతున్న ప్రభుత్వంగా ప్రపంచ రికార్డ్ సృష్టించిందని విమర్శించారు. తాజాగా పెంచిన రూ. 50తో ఈ ఏడాది కాలంలోనే రూ. 244 మేర గ్యాస్ బండ రేటును పెంచిన మోదీ పాలనను చూసి అరాచకత్వం కూడా సిగ్గుతో తలదించుకుంటుందన్నారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు రూ. 410గా ఉన్న సిలిండర్ ధర ఈ రోజు సుమారు మూడు రెట్లు పెరిగి రూ. 1100 దాటడం దురదృష్టకరమన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ. 1100పైగా గ్యాస్ రేటు చేరడం బీజేపీ అసమర్థ పరిపాలనకు నిదర్శనమన్నారు. ధరేంద్ర మోడీ హయాంలో సిలిండర్ బండ ధరలతో పేదల్ని బాదే కార్యక్రమం అడ్డూ అదుపు లేకుండా సాగుతుందన్నారు. రాయితీకి రాం రాం చెప్పి..సబ్సిడీ ఎత్తేసి దేశ ప్రజలపై మోదీ దొంగ దాడి చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. నానాటికి రూపాయి విలువ తగ్గిపోతుంటే? దేశ ప్రజలతో కష్టాలతో సంబంధం లేకుండా పాలిస్తున్న మోదీ రాజ్యంలో భరించలేని విధంగా ధరలు పెరిగాయన్న కేటీఆర్, కొత్త ఉద్యోగాలు రాక, ఉన్న ఉద్యోగాలు ఊడి ప్రజల ఆదాయాలు పడిపోయాయని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కనికరం లేకుండా ప్రజల రక్తాన్ని పెరుగుతున్న ధరల పేరుతో పీల్చి పిప్పి చేస్తుందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాకముందు గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై గొంతు చించుకున్న నరేంద్ర మోదీతో పాటు బీజేపీ నాయకులంతా ఇప్పుడు తేలు కుట్టిన దొంగల లెక్క గప్ చుప్ అయ్యారని కేటీఆర్ అన్నారు.

## ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని ISO దీక్ష



**మునుగోడు, జూలై 7 (సమ సమాజం):** మునుగోడు మండల కేంద్రాల్లో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఇండియన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు రవితేజ పాల్గొని మాట్లాడుతూ పేరుకి నియోజకవర్గ కేంద్రం, కానీ విద్యార్థులు చదువుకోడానికి ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గు చేటు అని అన్నారు. అలాగే గతంలో సిఎం కెసిఆర్ ఎలక్షన్ల ముందు హామీ ఇవ్వడం జరిగింది. కానీ ఆ హామీ హామీగానే మిగిలిపోయింది. మునుగోడు విద్యార్థుల గోడుకు నిరసనగా మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకుంటే అక్రమంగా అరెస్ట్ చేయడం జరిగింది. ఇకనైనా మంత్రి చొరవ తీసుకొని ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకుంటే మళ్లీ ఎమ్మెల్యేగానీ మంత్రి కానీ కాన్వాయ్ని అడ్డుకుని నిరసన తెలుపుతామని అన్నారు. అలాగే ఐఎస్ వో దేనికైనా సిద్ధమే అని అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ నాయకులు పెండెం ధనంజయ్ నేత మాట్లాడుతూ తెలంగాణ వస్తే విద్యావ్యవస్థ బాగుపడుతుందని ఆశపడ్డాం కానీ తెలంగాణ వచ్చి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా నేటికి ఇంటర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ చేతగానితనం అని అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి గుంతకండ్ల జగదీశ్వరెడ్డి చొరవ తీసుకొని మునుగోడు మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం అనంతరం మునుగోడు ఎమ్మార్వో జక్కర్తి శ్రీనివాసులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో మునుగోడు గ్రామ సర్పంచ్ మిర్యాల వెంకన్న, ఐఎస్వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాసరాణి సత్యనారాయణ, ఐఎస్వో వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, బీఎస్పీ మండల నాయకులు పందుల సురేష్, ఐఎస్వో నాయకులు కొండ పెల్లి శ్రీరామ్, ఉదయ్, రమేష్, జనార్దన్ కుమార్, నజీర్, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్లపూర్‌లో యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



**దోమ, జూలై 7 (సమ సమాజం):** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టి రాంమోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గ్రామ యువజన కాంగ్రెస్ కమిటీ నీ ఎన్నుకోవడం జరిగింది . ఈ కార్యక్రమములో ముఖ్య అతిథి పాల్గొన్న మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని సబ్బండ వర్గాల మనోభావాలను గౌరవించే ఏకైక రాజకీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ విషపూరిత భావాలతో రెచ్చగొట్టే .... అబద్ధాలు ప్రచారం చేసుకొని రాజకీయ పబ్బం గడుపుకుంటూ. సమాజాన్ని..విడదీయలని చూస్తున్న శక్తులకు.. తన పనితనముతో ధీటైన జవాబు చెప్పాలని యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ లో కాంగ్రెస్ రాబోయే ఎన్నికలలో అధికారాన్ని చేజికించకోబుతున్నది అని అది దిశగా అందరం కృషి చేయాలని అన్నారు. బుద్లాపూర్ గ్రామ యువజన కాంగ్రెస్ కమిటీ.. అధ్యక్షులు గా వర్క్యా సురేష్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి. రమేష్, ఉపాధ్యక్షులుగా డి. ఆంజనేయులు, వర్య విజయ్, ప్రధాన కార్యదర్శిగా ఎల్ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులు గా అరుణాచలం, జె శ్రీనివాస్ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమములో నియోజికవర్గం యువజన కాంగ్రెస్ ముఖ్యనాయకులు ఎర్రగడ్డపల్లీ జగన్, రామకృష్ణ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి రమేశ్ గౌడ్, బుద్లాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు గోవర్ధన్, పర్గి యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాగవర్ధన్, కాంగ్రెస్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అరకొరగా పుస్తకాల సరఫరా

**కుమరంభీం ఆసిఫాబాద్, జూలై 7 (సమ సమాజం):** జిల్లాలో 1,127 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక 903, ప్రాథమికోన్నత 111, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ, సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 73,318 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తోంది. జిల్లాలోని విద్యార్థులకు 5,15,433 పుస్తకా లు అవసరముండగా ఇప్పటి వరకు కేవలం 2,58,600 పుస్తకాలు మా త్రమే వచ్చాయి. ఇంకా 2,57,716 పుస్తకాలు రావాల్సి ఉంది. ఇప్పటి వర కు 1,35,205 పుస్తకాలను అయా పాఠశాలలకు పంపిణీ చేశారు. వచ్చింది అరకొరె..ప్రతీ తరగతికి సబ్జెక్టుకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు అరకొరగా జిల్లాకు చేరాయి. 15నుంచి రెవెన్యూ సదస్సులు

## సిద్ధం అవుతున్న అధికార యంత్రాంగం

**జగిత్యాల, జూలై 7 (సమ సమాజం):** జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ప్రతి మండల కేంద్రంగా మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించాల్సి ఉంటుందిజ దీంతో కలెక్టర్ సమీక్షించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సదస్సులకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ రవి నాయక్ అధికారులను ఆదేశించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మండలంలో ఇప్పటివరకు అందించిన దరఖాస్తుల మేరకు భూ సమస్యలపై తహసీల్దార్లు సంపూర్ణ నివేదిక తయారు చేసి సమర్పించా లన్నారు. జిల్లాలోని జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, మల్యాల, కొడిమ్యాల మండలాల్లో జాతీయ రహదారి నిర్మాణానికి సంబందించిన భూ సర్వే ప్రక్రియ దాదాపుగా 50 శాతం ముగిసిందని, పెండింగ్ భూ సర్వే ప్రక్రియను రానున్న వారం రోజుల్లో పూర్తయ్యే విధంగా వేగవంతం చేయాలన్నారు. అలాగే పశువులు, జీవాలు, పెంపుడు జంతువులు సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి సంవత్సరం పెంపుడు జంతువులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించడానికి కుటుంబ నియంత్రణ, వాక్సినేషన్ చేసి వదిలిపెట్టడం కోసం మున్సిపల్ పరిధిలో రూ25లక్షలతో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్ర మించే ప్రమాదం ఉందన్నారు.

## అందుబాటులో ఎరువులు, విత్తనాలు

### పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దపల్లి, జూలై 7 (సమ సమాజం):** రైతుల సంక్షేమమే ధ్యే యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నబొంకూరు గ్రామంలో రూర్బన్ నిధులు 36 లక్షల రూపాయలతో నిర్మించిన గోదామును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలను ఆయా గోదాముల్లో అందుబా టులో ఉంచుతున్నారన్నారు. ఎరువుల కోసం రైతులు మండల కేంద్రానికి, చిన్నకలువలకు రానవసరం లేకుండా ఆయా గ్రామాల్లో ఉన్న గోదాముల్లోనే విక్ర యిస్తున్నారన్నారు. కేడీసీసీబీ డైరక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ చిన్నకలువల సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో గోదాములను నిర్మించుకున్నామని, ప్రతి వ్యవసాయ సీజన్‌లో రైతుల అవసరమైన వాటిని ఈ గోదాముల వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు.

## కెజిబివి పాఠశాల ఘటన బాధ్యుతలపై చర్య తీసుకోవాలి

**నిర్మల్, జూలై 7 (సమ సమాజం):** భైంసా కేజీబీవీ పాఠశాల నిర్వాహణను ప్రక్షాళన చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. భైంసాలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి పురుగులతో కూడిన అన్నం తిని అస్వస్థత చెందారు. బీజేపీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి భోస్లే మోహన్‌రావుపటేల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారి తక్షణమేచర్యలు తీసుకోవాలన్నారు. పురుగుల అన్నం అందించడంపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పురుగుల అన్నం వడ్డింపుపై విచారణ జరిపి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## కొర్రమీను విత్తనోత్పత్తికి శ్రీకారం

**ఖమ్మం, జూలై 7 (సమ సమాజం):** కొర్రమీను చేపపిల్లల విత్తనోత్పత్తికి వైరాలోని చేపపిల్లల విత్తనోత్పత్తి కేంద్రంలో శ్రీకారం చుట్టారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ కేంద్రానికి చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ ఆక్వాకల్చర్ తో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఇక్కడ కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తిని చేపట్టారు. 018 ఆగస్టులో ఇక్కడ కొర్రమీను చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించగా.. అనేక ఆటంకాలతో మూడేళ్లుగా ప్రణాళిక ముందుకు సాగలేదు. ప్రస్తుతం అన్ని రకాలుగా అనుకూలిస్తుండటంతో మళ్లీ రెండోసారి కొర్రమీను పిల్లల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు.రాష్ట్రం మొత్తంమీద వైరా విత్తనోత్పత్తి కేంద్రాన్ని ఎంపిక చేసింది. ఇక్కడ నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో వైరాలో కొర్రమీను చేపపిల్లలు ఉత్పత్తి చేసి ఫలితాలు సాధించిన తర్వాత రాష్ట్రంలో మరికొన్ని చోట్ల ఆ ప్రక్రియ చేపట్టి చెరువుల్లో ఆపిల్లలు సరఫరా చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. వైరా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బుజ్జిబాబు ఆధ్వర్యంలో 800గ్రాముల నుంచి 1100గ్రాముల బరువున్న కొర్రమీను చేపపిల్లలను సేకరించి వాటి ద్వారా పిల్లల ఉత్పత్తి ప్రక్రియ చేపట్టారు. నెలరోజుల నుంచి కొర్రమీను చేపలకు జీవించి ఉన్న చిరుచేపలను ఆహారంగా అందిస్తున్నారు.

## భద్రాద్రి వద్ద గోదవారికి జలకళ

### సీతమ్మసాగర్ కాపర్‌డ్యాం మునక

**భద్రాచలం, జూలై 7 (సమ సమాజం):** ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి జలకళ వచ్చింది. మేడిగడ్డ ప్రాజెక్టుకు ఎగువనుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో దిగువన ఉన్న అశ్వాపురం మండలం దుమ్ముగూడెం ఆనకట్టకు వరద పోటెత్తుతోంది. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద సీతమ్మసాగర్ బ్యారేజ్‌కు సంబంధించిన కాపర్‌డ్యాంపై నుంచి వరద పారుతుండటంతో బ్యారేజ్‌పనులు నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న సీతమ్మ బ్యారేజ్ మొదటి కాపర్‌డ్యాం నీటమునిగింది. దీంతో బ్యారేజ్ పనులు నిలిచి పోయాయి. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి యంత్రాలను, ఇతర సామగ్రిని బయటకు తరలించారు. అలాగే ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరికి కొత్తనీరు వచ్చింది. నిన్న మొన్నటి వరకు ఇసుక తిన్నెలతో దర్శనమిచ్చిన గోదావరి ఈ సీజన్‌లో తొలిసారి జలకళను సంతరించుకుంది. గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రం 6గంటలకు 15అడుగులకు చేరుకుంది. గోదావరికి కొత్తనీరు వచ్చి చేరడంతో భక్తులు, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు. ఎగువనున్న మర్కోడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగుతుండగా.. పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయ నీటిమట్టం కూడా క్రమంగా పెరుగుతోంది. కిన్నెరసాని కాలువ పరిసరాల రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ మోటార్లను సురక్షితమైన ప్రాంతాలకు తరలించుకోవాలని ప్రాజెక్టు అధికారులు సూచించారు. కొద్ది రోజుల క్రితం ఆకేరులో చెక్ డ్యాంను పూర్తిచేశారు. దీనికి కూడా వరదనీరు పొంగుతోంది.ఏళ్లనాటి సాగు, తాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికింది.

## మాజీ ఎమ్మెల్యే పులపర్తి హఠాన్మరణం

### సంతాపం తెలిపిన రాజకీయ ప్రముఖులు

**కోనసీమ, జూలై 7 (సమ సమాజం):** మాజీ ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి హఠాన్మరణం చెందారు. గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో అమలాపురంలోని ఒక ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నారాయణ మూర్తికి భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గతంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిగా ఉన్న ఆయన రాజకీయాల్లో చేరి ప్రజాసేవకు అంకితమయ్యారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్న నారాయణమూర్తి మృతి పట్ల పలువురు సంతాపాన్ని ప్రకటించారు. నారాయణమూర్తి కుటుంబానికి సానుభూతి తెలిపారు. పీ గన్నవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి నారాయణకు గురువారం గుండెపోటు రావడంతో అమలాపురంలోని దవాఖానలో చేర్పించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. 1996 ఉప ఎన్నికల్లో నగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2004 లో ఈ స్థానం పొత్తుల్లో బీజేపీకి ఇవ్వడంతో.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014లో తిరిగి టీడీపీ నుంచి పీ గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ దక్కకపోవడంతో బీజేపీలో చేరారు. తర్వాత ఆ పార్టీ నుంచి కూడా తప్పుకున్నారు. నారాయణ మూర్తి హఠాన్మరణంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన అనుచరులు, పి.గన్నవరం నేతలు పులపర్తికి నివాళులర్పించారు. నగరం, పీ గన్నవరం నియోజకవర్గాల ఎమ్మెల్యేగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. విలువలకు కట్టుబడి రాజకీయాలు చేసిన అతికొద్ది మందిలో ఒకరిగా నారాయణ మూర్తి నిలిచారని నివాళు లర్పించారు.

## తల్లిని గెంటేసిన తనయుడు

### కారుణ్య మరణం కోసం పిటిషన్

**కాకినాడ, జూలై 7 (సమ సమాజం):** తల్లి బాగోగులు చూడాల్సిన కన్నకొడుకు, కోడలు కఠినంగా వ్యవహరించారు. ఇంటినుంచి గెంటేశారు. మనోవేదనకు గురైన ఆ తల్లి తనయుడి తీరును అధికారుల దృష్టికి తీసుకెళ్లానా ఫలితం లేకపోయింది. తీవ్రం మనస్తాపం చెందిన ఆ మాతృమూర్తి తనను కారుణ్య మరణానికి అనుమతించాలని పోలీసు సూపరింటెండెంట్‌కు మొరపెట్టుకుంది. ఈ హృదయ విదారక ఘటన కాకినాడ రూరల్ పరిధిలో జరిగింది. గైగోలపాడుకు చెందిన అచ్చియ్యమ్మను ఇటీవల తన చిన్నకొడుకు, కోడలు ఇంట్లో నుంచి గెంటేశారు. దీంతో ఆమె విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారు పట్టించుకోకపోవడంతో కాకినాడ ఎస్పీ రవీంద్రనాథ్ బాబుకు వినతి పత్రం అందజేశారు. తన బాధను ఆయనకు వివరించింది. చనిపోవాలని నిర్ణయించుకున్నానని, తనను కారుణ్య మరణానికి అనుమతించాలని ఎస్పీని కోరారు. దీంతో ఇప్పుడు అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో అని అంతా చర్చించుకుంటున్నారు.

## మృత్యుంజయుడు ఆ బాలుడు

### బోరుబావిలో పడగా తాళ్ల సాయంతో వెలికితీత

ఏలూరు,జూలై7(ఆర్ఎన్ఎ): బోరు బావిలో పడ్డ ఓ బాలుడిని స్థానికులు ప్రాణాలతో కాపాడారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గోలగుంటకు చెందిన జస్వంత్(9) అనే బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు 400 అడుగులు లోతు ఉన్న బోరు బావిలో పడిపోయాడు. అయితే బాలుడు 30 అడుగుల లోతులో రాయిపై చిక్కుకున్నాడు. జస్వంత్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రదేశాలు వెతికారు. అయినా బాలుడి ఆచూకి చిక్కలేదు. బోరుబావిలో నుంచి జస్వంత్ కేకలు వేయడంతో స్థానికులు అతనిని గుర్తించారు. వెంటనే హుటాహుటిన తాళ్ల సహాయంతో బోరు బావిలోకి దిగి బాలుడిని ప్రాణాలతో రక్షించి బయటకు తీశారు. సుమారు 5 గంటల పైనే జస్వంత్ బోరు బావిలో బిక్కుబిక్కుమంటూ గడిపాడు. ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే బాలుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రాణాలతో జస్వంత్ బయటపడటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వైసిపి బైలా సవరించేలా చర్యలు

### గౌరవ అధ్యక్ష పదవిని రద్దు చేసే యోచన

### శాశ్వత అధ్యక్షుడుగా జగన్ ఉండేలా రూపకల్పన

**అమరావతి, జూలై 7 (సమ సమాజం):** వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షురాలు పదవి నుంచి విజయలక్ష్మిని తొలగించేలా పార్టీ బైలాస్‌ను మారుస్తున్నారని ప్రచారం సాగుతోంది. నేటినుంచి జరిగే ప్లీనరీలో జగన్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేలా మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఆమెతోనే స్వయంగా రాజీనామా చేయించే విధంగా సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారని అంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు జరగనున్నాయి. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఈ సమావేశాలు జరగనున్నాయి. వైఎస్ జయంతోత్సవాల సందర్భంగా సీఎం జగన్ ఇడుపులపాయకు వెళ్లి అక్కడ నుంచి నేరుగా వచ్చి ప్లీనరీ సమావేశాలు ప్రారంభిస్తారు. పార్టీ బైలాని, నియమావళిని ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి మార్పు చేస్తున్నట్లు సజ్జల ప్రకటించారు. పార్టీకి శాశ్వత అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి ఉంటారని సమాచారం. అయితే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకొకసారి పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలి. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి ఉన్నారు. ఆమె తెలంగాణలో వైఎస్సార్‌టీపీకి గౌరవ అధ్యక్షురాలిగా ఉండడంతో రెండు రాష్ట్రాల్లో ఉండడం కుదరదనే ఉద్దేశంతో ఆమెను తప్పించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. పార్టీ గౌరవ అధ్యక్షురాలిగా విజయలక్ష్మిని తొలగించాలంటే పార్టీ రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. దీనిపై న్యాయవాదులు పరిశీలిస్తున్నారు. దీనికి షర్మిల పార్టీని సాకుగా చూపుతున్నారు. విజయలక్ష్మే స్వయంగా రాజీనామా చేసేలా వేస్తున్నారు. కాగా చెల్లి, తల్లిని పార్టీ నుంచి జగన్ తప్పించారంటూ విమర్శలు వస్తున్నాయి.

## నేడు ప్రపంచ చాక్లెట్ దినోత్సవం

### ఏటా జూలై 7న నిర్వహిస్తున్న ప్రపంచం



**విజయవాడ, జూలై 7 (సమ సమాజం):** చాక్లెట్ పేరు వింటే చాలు అందరి నోట్లో నీరూరుతుంది. చిన్న పిల్లలతో మొదలుకొని వయోధికుల వరకూ అందరూ చాక్లెట్ను ఇష్టపడతారు. ఏ షాపుకు ఎక్కడికి వెళ్లినా దర్శనమిస్తుంది. చాక్లెట్ చప్పరించడం ద్వారా మనోల్లాసంతోపాటు అద్భుతమైన ఆరోగ్యాన్నిస్తుందని పరిశోధనల ద్వారా తేల్చి చెప్పారు. ఐరోపాలో చాక్లెట్ పానీయం గురించి 1520 సంవత్సరం నుండి తెలుసు. యూరోపియన్లకు చాక్లెట్ అంటే తెగ ఇష్టం. ప్రపంచం మొత్తంలో సగం చాక్లెట్ల వినియోగం ఐరోపాలోనే జరుగుతుంది. జర్మనీలో ఏటా ఒక్కో మనిషి 11 కిలోల చాక్లెట్లు తింటారట. ప్రపంచ వ్యాప్తంగా క్యాడ్బరీ, మార్స్, నెస్లే, ఫెరోరీ, హేర్షేస్, లిండిట్, ఎజిస్టాక్స్, ఆర్కార్, మెర్జీ, ఇడ్జీజీ కంపెనీలు టాప్ టెన్గా గుర్తింపు పొందాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా పది లక్షల కోట్ల రూపాయల విలువైన చాక్లెట్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. 'అసోచామ్' సంస్థ గణాంకాల ప్రకారం మన గ్రామీణప్రాంతాల్లో చాక్లెట్ వ్యాపారం విలువ 750కోట్లరూపాయలట సంవత్సరానికి. ఎందుకంటే వీటి రుచుల్లో సుమారు 600 రకాలు ఉంటాయట. చాక్లెట్ వచ్చే చెట్టు శాస్త్రీయ నామం థియోబ్రామా కకావ్. దీని అర్థం 'దేవతల ఆహారం'. చాక్లెట్లు మొదటిసారిగా పరిచయం ఐరోపాలో 1550 జూలై 7న జరిగింది. అందుకే ఈ రోజును 'చాక్లెట్ డే'గా కేటాయించారు. 2009 నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈ వేడుకల్ని ఘనంగా చేసుకుంటున్నారు. దీని ఆరోగ్య ప్రయోజనాలు గుర్తించి కాబోలు జూలై 7ను ప్రపంచ చాక్లెట్ డేగా పాటిస్తున్నారు.కకోవాలోని టానిన్లు దంతాలమీద పాచిని తొలగిస్తాయి. కకోవాలో ప్రొటీన్లు, కాల్షియం, కాపర్, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, బి1, బి2, డి, ఇ విటమిన్లు పుష్కలంగా వుంటాయట. చాక్లెట్లలోని ఓలియాన్ ఆమ్లం గుండె జబ్బుల్ని రానివ్వదు. మెదడులో న్యూరో ట్రాన్స్మీటర్లుగా పనిచేసే సెరిటోనిన్, డోపమైన్ వంటి రసాయనాల విడుదలకు సహకరించడం వల్ల మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తుంది. అయితే బరువు ఎక్కువగా ఉన్న వాళ్లు మాత్రం క్యాలరీలను లెక్కించుకుని తినాల్సిందే. 1840 సంవత్సరంలో క్యాడ్బరీ చాక్లెట్ కంపెనీ ప్రారంభమైంది. మిల్క్ చాక్లెటంటే ప్రపంచ వ్యాప్తంగా మోజుపడతారు. కానీ మగవారు మాత్రం డార్క్ చాక్లెట్ అంటే ఇష్టపడతారని తేలింది. సాధారణంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టంగా లాగిస్తారు చాక్లెట్‌ని.కొకొవా గింజల పొడితో చేసిందే అసలైన చాకొలెట్. చా÷-లకెట్లలో వుండే కాల్షియం, మెగ్నీషియం, ఎముకల దృఢత్వాన్ని కల్గిస్తాయి. రక్తంలో షుగర్ శాతం తగ్గినట్లయితే చాక్లెట్ తినడం మంచిది.

## రైతు భరోసా కేంద్రాలు.. ధగా కేంద్రాలు: నక్కా

**గుంటూరు, జూలై 7 (సమ సమాజం):** జగన్ పాలనలో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జగన్ అధికారం చేపట్టాక వ్యవసాయం కుదేలయ్యిందని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాలు.. దగా కేంద్రాలుగా మారాయన్నారు. ప్రభుత్వం రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని తెలిపారు. రైతులు క్రాప్ హాలిడే ప్రకటించటం ప్రభుత్వానికి సిగ్గుచేటని నక్కా ఆనంద్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గల్లంతయిన మత్స్యకారులు క్షేమం

**విజయవాడ, జూలై 7 (సమ సమాజం):** సముద్రంలో గల్లంతైన మత్స్యకారులకథ సుఖాంతమైంది. కొన్ని రోజుల క్రితం సముద్రంలో గల్లంతైన నలుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. తాము క్షేమంగా ఉన్నట్లు జాలర్లు ఫోన్లో బంధువులకు సమాచారం ఇచ్చారు. నరసాపురం కొత్తపాలెం వద్ద ఉన్నట్లు మత్స్యకారులు తెలిపారు. మత్యకారులు చిన్న మస్తాన్, నాంచారరులు, నరసింహారావు, వెంకటేశ్వరరావు గత ఐదు రోజులుగా సముద్రంలో కనిపించకుండా పోయారు. చివరకు వారు క్షేమంగా ఉన్నారని తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## విజయమ్మను తప్పించడం సరికాదు

### జగన్ విజయంలో ఆమెనే కీలకపాత్రధారి

### టిడిపి తదితరనేతల వ్యాఖ్యానాలు

అమరావతి,జూలై7(ఆర్ఎన్ఎ): వైసీపీ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు జరగనున్నాయి. విజయమ్మ తెలంగాణలో వైఎస్సార్‌టీపీకి గౌరవ అధ్యక్షురాలిగా ఉండడంతో రెండు రాష్ట్రాల్లో ఉండడం కుదరదనే ఉద్దేశంతో ఆమెను తప్పించే అవకాశం ఉందనే ప్రచారం జరుగు తోంది. పార్టీ గౌరవ అధ్యక్షురాలిగా విజయలక్ష్మిని తొలగించాలంటే పార్టీ రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. దీనిపై న్యాయవాదులు పరిశీలిస్తున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఈ సమావేశాలు జరగనున్నాయి. వైఎస్ జయంతోత్సవాల సందర్భంగా సీఎం జగన్ ఇడుపులపాయకు వెళ్లి అక్కడ నుంచి నేరుగా వచ్చి ప్లీనరీ సమావేశాలు ప్రారంభిస్తారు. ఈ క్రమంలో ఆమెను తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షురాలు విజయమ్మ రాజీనామా వైసీపీకి పెద్దదెబ్బ అని న్యాయవాది శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ విజయం ప్రజలతో వచ్చింది కాదని, ఆయన గెలుపు వెనుక విజయమ్మ కష్టం ఉందని గుర్తుచేశారు. అధికారం, డబ్బు కోసం తల్లిని దూరం పెట్టడం దారుణమన్నారు. తల్లి, చెల్లికి అన్యాయం చేసినవాడు రాష్ట్రానికి ఏం మంచి చేస్తాడని శ్రవణ్‌కుమార్ ప్రశ్నించారు. అధికార పార్టీగా జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విలువలు, విశ్వసనీయత అని మాట్లాడే అర్హత జగన్ కోల్పోయారని తెలిపారు. వైఎస్సార్, విజయమ్మ ఫొటోలు పెట్టుకోకుండా జగన్ గెలవలేరని శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. విజయమ్మ సాగనంపేందుకు జగన్ ఎత్తుగడ వేశారు. ఆమెతోనే స్వయంగా రాజీనామా చేయించే విధంగా జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తన వెంట నడిచేవారిని సీఎం జగన్ నట్టేట ముంచారని టీడీపీ నేత జీవీరెడ్డి దుయ్యబట్టారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు వైఎస్ విజయమ్మ హామీలు ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు నెరవేర్చ లేదని, హామీలు ఇచ్చిన ఆమెను తప్పించారని తప్పుబట్టారు. దీనికి వైసీపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. అక్కచెల్లెమ్మలంటూ ఆడబిడ్డలనూ ముంచేందుకు జగన్ వెనకాడని జీవీరెడ్డి విమర్శించారు. జగన్ దృష్టిలో కుటుంబీకులకు విలువ లేదని సీపీఎం నేత గఫూర్ విమర్శించారు. జగన్‌ను సీఎం చేసేందుకు బైబిల్ పట్టుకుని విజయమ్మ రాష్ట్రమంతా తిరిగారని గుర్తుచేశారు. తల్లిని పార్టీ నుంచి తప్పించడం దారుణమన్నారు. ఇది కృతజ్ఞతా.. కృతఘ్నుతా అని గఫూర్ వ్యాఖ్యానించారు. జయమ్మను సాగనంపేందుకు జగన్ ఎత్తుగడ వేస్తున్నారు. కుటుంబ వ్యవహారాలతో విజయమ్మ హైదరాబాద్‌లో ఉంటోంది. షర్మిల పార్టీకి ఆమె పెద్దదిక్కుగా ఉన్నారు. విజయమ్మతో రాజీనామా చేయించేందుకు జగన్ ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలివిగా వైసీసీ గౌరవ అధ్యక్షురాలి స్థానం నుంచి తప్పించేలా ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. షర్మిల పార్టీని జగన్ సాకుగా చూపుతున్నారు. విజయమ్మనే స్వయంగా రాజీనామా చేసేలా జగన్ ఎత్తుగడ వేస్తున్నారు. విజయమ్మతో రాజీనామా చేయించేలా జగన్ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు విజయమ్మకు జగన్ నేరుగా సమాచారం ఇవ్వలేదు. లేఖ ద్వారా విజయమ్మకు తెలియజేశారు.




# చలన చిత్రం


## తెలుగు నేటివిటీకి దగ్గరగా భోళాశంకర్




మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలలో మెహర్ రమేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోళా శంకర్' షూటింగ్ చక చకా జరుగుతోంది. తమిళ సూపర్ హిట్ మూవీ 'వేదాళం' సినిమాకి అధికారిక రీమేక్ గా ఈ సినిమాను రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ మూవీని తెలుగు నేటివిటీకి, మెగాస్టార్ ఇమేజ్‌కు సరిపోయేలా కథలో కొన్ని కీలక మార్పులు చేర్పులు చేశారు.భోళా శంకర్ సినిమాలో చిరంజీవి సరసన మిల్కీ బ్యూటీ తమన్నా హీరోయిన్‌గా.. చిరు చెల్లెలి పాత్రలో కీర్తి సురేశ్ కనిపించనుంది. అయితే, ఈ ఏడాది చివరిలో ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ, తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ రిలీజ్ ప్లాన్ మారినట్టు తెలుస్తోంది. మలయాళ సూపర్ హిట్ మూవీ లూసిఫర్ కి రీమేక్ గా తెరకెక్కుతున్న గాడ్ ఫాదర్ సినిమాలో చిరు పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. ఇటీవలే ఈ మూవీ ఫస్ట్ లుక్ రిలీజై సూపర్ రెస్పాన్స్ తెచ్చుకుంది. మోహన్ రాజా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో నయనతార, సల్మాన్ ఖాన్, పూరి జగన్నాథ్, సత్యదేవ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ మూవీని దసరా కానుకగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ తర్వాత యువ దర్శకుడు బాబీతో మెగాస్టార్ చేస్తున్న 154వ సినిమా రిలీజ్ ఉండబోతుంది. ప్రస్తుతం ఈ మూవీకి వాల్తేరు వీరయ్య అనే టైటిల్ పరిశీలనలో ఉంది. శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తున్న ఇందులో మెగాస్టార్ ఊర మాస్ రోల్ చేస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని 2023, సంక్రాంతికి రిలీజ్ చేయనున్నారు. అయితే మెహర్ రమేష్ తో మెగాస్టార్ చేస్తున్న భోళా శంకర్ ని వచ్చే ఏడాది ఉగాదికి రిలీజ్ చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన కూడా రానున్నట్టు సమాచారం.

## చాలాకాలం తరవాత మళ్లీ తెరపైకి వేణు

నటుడు వేణు తొట్టెంపూడి 'స్వయంవరం' సినిమాతో తెరంగేట్రం చేసిన ఆయన తొలి ప్రయత్నంలోనే హిట్ కొట్టాడు. ఆ తర్వాత చిరు నవ్వుతో, గోపి గోపిక.. గోదావరి వంటి చిత్రాల్లో లీడ్ రోల్ పోషించిన ఆయన.. తనదైన శైలిలో ఫిలాసఫి డైలాగ్‌లు చెబుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. ఇక హనుమాన్ జంక్షన్, పెళ్లాం ఊరెళితే, ఖుషి ఖుషిగా వంటి సినిమాల్లో సహానటుడిగా కామెడీ పండిస్తూ ప్రేక్షకలను ఆకట్టుకున్నాడు. అలా హీరోగా, కమెడియన్‌గా తన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఆయన కొంతకాలంగా సినిమాలకు దూరమయ్యాడు. చివరిగా దమ్ము, రామాచారి చిత్రాల్లో కనిపించిన ఆయన ఆకస్మాత్తుగా తెరపై కనుమరుగయ్యాడు. దాదాపు పదేళ్ల తర్వాత వేణు రవితేజ రామారావు ఆన్‌డ్యూటీ మూవీతో రీఎంట్రీ ఇస్తున్నాడు. ఈ మూవీలోని వేణు ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో అతడు సీఐ మురళిగా కనిపించనున్నాడు. ఈ నేపథ్యంలో వేణు సోషల్ మీడియా వేదికగా ఓ చానల్‌తో ముచ్చటించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను రామారావు ఆన్‌డ్యూటీ మేకర్స్ ఎస్ఎల్‌వీ సినిమాస్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. చాలా రోజుల తర్వాత మళ్లీ నటించడం చాలా ఆనందంగా ఉంది. కొన్ని అనివార్య కారణాల వల్ల నటనకు దూరంగా ఉన్నా. మళ్లీ ఇంతకాలానికి రామారావు ఆన్‌డ్యూటీతో రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో నేను సీఐ మురళిగా కనిపిస్తాను. దీనికి సంబంధించిన పోస్టర్ కూడా విడుదలైంది.



## నాగచైతన్య 'థాంక్యూ' 24న విడుదల



అక్కినేని హీరో నాగచైతన్య అప్ కమింగ్ మూవీ 'థాంక్యూ'. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మూవీ ప్రమోషన్‌లో భాగంగా బిజీగా ఉన్న చైతూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. తనకు అత్యంత ముఖ్యమైన వారికి థాంక్యూ చెప్పాడు. ' థాంక్యూ అనే పదాన్ని ఎక్కువగా వాడుతుంటా.. ఈ ఆలోచనకు థాంక్యూ చిత్రం కారణం. ఈ మూవీ జర్నీ నన్ను కదిలించింది ' అంటూ తన జీవితంలోని ముఖ్యమైన వ్యక్తులకు అంకితం ఇస్తున్నట్లుగా తెలిపాడు. ఈ పోస్ట్ లో తన తల్లిదండ్రులైన నాగార్జున, లక్ష్మి దగ్గుబాటి తన పెంపుడు కుక్కతో కలిసి దిగిన ఫోటోలను అందులో షేర్ చేశాడు.'అన్ని విషయాల్లో నాకు సపోర్ట్ చేస్తూ నాపై అంతులేని ప్రేమను చూపించిన అమ్మకు థ్యాంక్స్', 'నాకు తోడుగా నిలిచినందుకు, స్నేహితుడిగా ఉన్నందుకు నాన్నకు 'థ్యాంక్స్ 'ఎలా ప్రేమించాలో, మనిషిగా ఎలా ఉండాలో చూపించినందుకు థ్యాంక్స్ హ్యాష్' అంటూ ఎమోషనల్ గా రాసుకొచ్చాడు. రాశీ ఖన్నా హీరోయిన్ గా నటిస్తోన్న థాంక్యూ చిత్రానికి విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు, –శిరీష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన సాంగ్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సినిమా పైన మంచి అంచనాలున్నాయి. అటు అమీర్?ఖాన్, కరీనా కపూర్‌ల లాల్ సింగ్ చద్దా మూవీతో చైతూ బాలీవుడ్ అరంగేట్రం చేయనున్నాడు. ఈ ఏడాది ఆగస్ట్ 11న సినిమా విడుదల కానుంది.

## ఇళయారాజా,విజయేంద్రప్రసాద్‌లకు శుభాకాంక్షల వెల్లువ





అభినందనలు తెలిపిన రజనీకాంత్, మెగాస్టార్ రాజ్యసభకు ఎంపికైన అగ్ర సంగీత దర్శకుడు ఇళయరాజా , బాహుబలి రచయిత విజయేంద్ర ప్రసాద్ లను సినీ ప్రముఖులంతా ప్రశంసలతో ముంచెత్తుతూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇప్పటికే సూపర్ స్టార్ రజనీకాంత్ వీరికి శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఇప్పుడు మన లెజండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి తన ట్విట్టర్ ఖాతాలో ఇళయరాజాకు, విజయేంద్ర ప్రసాద్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ వేరు వేరుగా పోస్టులు పెట్టారు. అలాగే, భారత ప్రధాని నరేంద మోదీకి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలిపారు. కేందప్రభుత్వం రాష్ట్రపతి కోటాలో మొత్తం నలుగురిని రాజ్యసభకు నామినేట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి వరుస ట్వీట్స్ చేసి అటు మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు..ఇటు ఇళయరాజా, విజయేంద్ర ప్రసాద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. అసమానమైన సంగీత మేధావి ఇళయరాజాకి హృదయ పూర్వక అభినందనలు. రాజ్యసభలో మీరు అడుగుపెట్టిన తర్వాత ఎగువ సభలో మేదావి వర్గాల్లో ఒకరిగా ఖచ్చితంగా గుర్తింపు సాధిస్తారు. మీలాంటి గొప్ప వ్యక్తి నా సినిమాలకు సంగీతాన్ని అందించడం సంతోషంగా అనిపిస్తోంది'..అని ఇళయరాజాకు విషెస్ చెప్పారు. ఇదే క్రమంలో.. 'భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత నిష్ణాతులు, అద్భుతమైన కథా రచయితలలో ఒకరైన కె.వి.విజయేంద్ర ప్రసాద్ రాజ్యసభ సభ్యునిగా నామినేట్ అయినందుకు హృదయపూర్వక అభినందనలు. మీ ఉనికి మన ఎగువ సభ కీర్తిని పెంచుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు'..అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

## పలు చిత్రాలతో బిజీగా తాప్సీ 15న విడుదల అవుతున్న శభాష్ మిథు



బాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీస్ లిస్ట్‌లో తాప్సీ పన్ను పేరు ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఆకర్షించే అందం, ఆకట్టుకొనే అభినయం ఆమె సొంతం. ఒక పాత్ర చేస్తే దానికి నూరు శాతం న్యాయం చేయడం ఆమె స్పెషాలిటీ. ప్రస్తుతం తాప్సీ చేతిలో బోలెడన్ని ప్రాజెక్ట్స్ ఉన్నాయి. కొన్ని చిత్రీకరణ దశలో ఉన్నాయి. మరికొన్ని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్నాయి. ఆమె నటించిన తాజా చిత్రం 'శభాష్ మిథు' ఇండియన్ మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ జీవిత కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. ఈ నెల 15న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో 'శభాష్ మిథు' చిత్రం ప్రమోషన్స్‌ను జోరుగా చేస్తున్నారు. అందులో భాగంగా తాప్సీ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చింది. 'శభాష్ మిథు' చిత్రం గురించి పలు విశేషాల్ని వెల్లడించిన తాప్సీ.. తన డ్రీమ్ రోల్ ఏంటో చెప్పింది. 'సూపర్ హీరో పాత్ర చేయాలన్నది నా డ్రీమ్.. అది కూడా 'ది అవెంజర్స్' సిరీస్‌లో నటించాలి. అందులో ఆల్రెడీ ఉన్న పాత్ర కాకుండా.. నా కోసం ప్రత్యేకించి ఇండియన్ సూపర్ హీరో పాత్ర డిజైన్ చేయాలి. ఇదే నా అతి పెద్ద డ్రీమ్'.. అని తాప్సీ తన మనుసులోని కోరికను వెల్లడించింది. తాప్సీ గతంలో ఎన్నో మహిళా ప్రధాన్య మున్న చిత్రాల్లో నటించింది. వాటిలో చాలా వరకూ బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించాయి. 'శభాష్ మిథు' చిత్రంలోని ఆమె పాత్ర సూపర్ హీరో లాంటిదే అని ఆ సినిమా నిర్మాతలు అభిప్రాయపడుతు న్నారు. తాప్సీ ఈ సినిమా తర్వాత నటిస్తున్న మరో అతి ముఖ్యమైన చిత్రం 'డంకీ' . కింగ్ ఖాన్ షారుఖ్ , రాజ్‌కుమార్ హిరాణి కలయికలోని తొలి చిత్రంగా విశేషాన్ని సంతరించుకుంది. ఇందులో తాప్సీ.. ఇదివరకెన్నడూ చేయని కొత్త తరహా పాత్ర చేస్తోంది. మరో పక్క ఆమె నిర్మాణ రంగంలోకి అడుగు పెడుతూ.. తొలి ప్రయత్నంగా ఒక భారీ సినిమా నిర్మిస్తోంది. అందులో సమంత లీడ్ రోల్ చేస్తోందని తాప్సీనే ఇటీవల ప్రకటించింది. అతి త్వరలో సినిమా సెట్స్ పైకి వెళ్ళబోతోంది.

## 15 నుంచి ఓటిటిలో స్ట్రీమ్ కానున్న సమ్మతమే




వినూత్న కథలను ఎంచుకుంటూ తన నటన, అభినయంతో సినీరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు కిరణ్ అబ్బవరం. చేసింది నాలుగు సినిమాలే అయినా ప్రేక్షకులలో మంచి స్థానం సంపాదించుకున్నాడు. ఈ ఏడాది మొదట్లో 'సెబాస్టియన్'తో నిరాశపరిచిన ఇటీవలే విడుదలైన 'సమ్మతమే' చిత్రంతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశాడు. జూన్ 24న విడుదలైన ఈ చిత్రం పాజిటీవ్ టాక్‌ను తెచ్చుకుని సూపర్ హిట్‌గా నిలిచింది. విడుదలైన మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్‌ను పూర్తి చేసుకుని కమర్షియల్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ ఆహాలో జూలై 15నుండి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. కాగా సినిమా విడుదలైన నాలుగు వారాల్లోపే డిజిటల్‌లోకి వచ్చేస్తుంది. లవ్ ఎంట్టంల్గ÷నర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని గోపినాథ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. కిరణ్‌కు జోడీగా 'కలర్‌ఫోటో" ఫేం చాందిని చౌదరి హీరోయిన్‌గా నటించింది. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ చిత్రాన్ని యూజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కంకనాల ప్రశీణ నిర్మించారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in